సాక్షి వరంగల్

మంగళవారం | 3 | జూన్ | 2025



నాగాభరణం బహూకరణ

సోమేశ్వర లక్ష్మీనృసింహస్వామికి ఓ భక్తుడు రూ.24లక్షల విలువైన మిశ్రమ బంగారు నాగాభరణం సమర్పించినట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు తెలిపారు. - IIలో ▸



సమర్థవంతంగా వైద్య సేవలు అందించాలి

సమర్థవంతంగా వైద్య సేవలు అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. - IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $34^0/27^0$

ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా పరిషత్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ



న్యూశాయంపేట: వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టర్, జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి సత్యశారద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈఓ రాంరెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

రామన్నపేట: వరంగల్ మండల పరిధి ఐదు రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 3(మంగళవారం) నుంచి 7వ తేదీ వరకు 'భూ భారతి' రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇక్బాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 3న మట్టెవాడ, 4న ఏనుమాముల, 5న పైడిపల్లి, దేశాయిపేట, 6న కొత్తపేటలో సదస్సులు ఉంటాయన్నారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్లు, ఆర్ఐలు హాజరవుతారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

కొడ్తిమాటు తండాలో చోరీ

ఖానాపురం: మండలంలోని కొడ్తిమాటుతండాకు చెందిన లావుడ్య చంద్రుకాంతమ్మ ఇంట్లో శనివారం దొంగలు రూ.లక్ష ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం చంద్రుకాంతమ్మ కుటుంబ సభ్యులతో కలిసి పనుల నిమిత్తం మండలంలోని పెద్దమ్మగడ్డ గ్రామానికి వెళ్లింది. పనులు ముగించుకుని రాత్రి 11 గంటలకు ఇంటికి చేరుకోగా.. తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై రఘుపతి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆదివారం ఉదయం క్లూస్‌టీం అధికారులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. కాగా రెండు రోజుల క్రితమే ధాన్యం విక్రయించగా ఖాతాలో జమ అయిన రూ. లక్ష డబ్బులు బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసుకుని వచ్చి ఇంట్లోని బీరువాలో పెట్టగా.. దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. బీరువాలో వెండి వస్తువులు ఉండగా.. దొంగలు వాటిని ముట్టుకోకుండా కేవలం డబ్బులు మాత్రమే తీసుకెళ్లారని కుటుంబీకులు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 8 మంది ప్రయాణికులకు గాయాలు



దుగ్గొండి: ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్ నుంచి నర్సంపేటకు వస్తోంది. ఈక్రమంలో గిర్నిబావిలో మన గ్రోమోర్ సెంటర్‌కు ఎదురుగా రోడ్డు పైన ఎరువుల బస్తాల లారీ ఆగి ఉంది. ఇదే సమయంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ పక్కనే ఉన్న డోర్ ఊడింది. దీంతో డ్రైవర్ డోర్ వైపునకు చూడడంతో బస్సు అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోగా.. బస్సులోని 8 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఆస్పత్రికి తరలించారు.

ప్రాంగణ నియామకాలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధి కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్ హైటెక్ సిటీలోని డీఎస్‌కే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఫ్రంట్ అండ్ డెవలపర్లుగా ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆరుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు డి.సత్యారెడ్డి, ఎం.సాయిపవన్, ఎస్.అరవింద్, టి.పుష్కరాణి, ఎం.మనస్విని, ఎ.వర్షిత ఎంపికైనట్లు కొత్తగూడెం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్‌మోహన్‌రాజు కేయూలో జరిగిన కార్యక్రమంలో తెలిపారు. ఒక్కొక్కరికి వార్షిక వేతనం రూ.6లక్షలు ఉంటుందని, తొలుత మూడునెలలపాటు శిక్షణ కూడా ఇస్తారని, అనంతరం హైటెక్ సిటీలోని డీఎస్‌కే సాఫ్ట్‌వేర్ కంపెనీలో పూర్తిస్థాయిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆయా విద్యార్థులకు నియామక పత్రాలను సోమవారం యూనివర్సిటీలో కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, ఆకాలేజీ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.రాము, కేయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు అందజేశారు.

రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధి





జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ సత్య శారద, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న పొంగులేటి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

గతంలో లేని విధంగా రూ.4,962 కోట్ల కేటాయింపు

- 2040 అవసరాలకు సరిపోయేలా మాస్టర్ ప్లాన్
- మామునూరు విమానాశ్రయ భూసేకరణకు రూ.205 కోట్లు
- అవతరణ వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, వరంగల్/ఖిలా వరంగల్: చారిత్రక వరంగల్ నగరాన్ని తెలంగాణకు రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందించినట్లు రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ నగరాభివృద్ధికి రూ.4,962 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఖిలావరంగల్ మైదానంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. చారిత్రాత్మక వరంగల్ నగర అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. 2040 వరకు జనాభా పెరుగుదలకు అనుగుణంగా వరంగల్ నగర అవసరాలకు సరిపోయేలా మాస్టర్ ప్లాన్ తీసుకొచ్చామన్నారు. వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్‌పోర్ట్ కల త్వరలో సాకారం కానున్నట్లు తెలిపారు. విమానాశ్రయ భూసేకరణకు ప్రభుత్వం రూ.205 కోట్లు ఇప్పటికే విడుదల చేసినట్లు.. ఈ విమానాశ్రయం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు ప్రయోజనం కలగనుందన్నారు.

ఓరుగల్లుకు ప్రత్యేక గుర్తింపు

వరంగల్ జిల్లాలో ఖరీఫ్‌లో లక్షా 22 వేల 340 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.62 కోట్ల బోనస్ చెల్లించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రబీ సీజన్‌లో జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా.. 187 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు లక్షా 62 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో ప్రత్యేకంగా పండించే చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) లభించినట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలో 47 వేల ఇళ్లను మంజూరు చేయగా.. వరంగల్ జిల్లాకు మంజూరైన 612 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నట్లు తెలిపారు. వేడుకల్లో కలెక్టర్ సత్య శారద, మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రజాప్రతినిధులు అధికారులు ఆసక్తిగా తిలకించారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశంసపత్రాలు అందించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు మెమొంటోలు అందించి శాలువాలతో సత్కరించారు.

యుద్ధప్రాతిపదికన పనులు..

నర్సంపేట మెడికల్ కాలేజీ, హాస్పిటల్, కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించినట్లు, వరంగల్ కొత్త బస్ స్టేషన్ పనులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల వేగవంతం, రూ.80 కోట్ల వ్యయంతో వరంగల్‌లో నిర్మిస్తున్న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం (కలెక్టరేట్), వరంగల్ జిల్లాలో ప్రతిష్టాత్మక కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు పనుల్ని చిత్తశుద్ధితో అన్ని హంగులతో త్వరలోనే పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా.. అటవీ శాఖ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి 25,85,600 మొక్కలు నాటి 101 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. 382 ఎకరాల్లో విస్తరించి ఉన్న భద్రకాళి చెరువు పూడికతీత పనులు శరవేగంగా సాగుతున్నట్లు తెలిపారు. బ్యాంక్ లింకేజీ కింద 7,933 స్వశక్తి మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి రూ.475 కోట్ల రుణాలు మంజూరు చేసి రికవరీ చేసినందుకు వరంగల్ జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు లభించినందుకు అభినందనలు తెలిపారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు



- మరిన్ని ఫొటోలు II, IIIలో ▸



ఏర్పాటు చేసిన శకటం



సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారద

పేదల ఆత్మగౌరవానికి ప్రతీక సొంతిళ్లు

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ




ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్యశారద

వర్ధన్నపేట: పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక సొంతిళ్లు అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం వర్ధన్నపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ కలెక్టర్ సత్యశారదతో కలిసి వర్ధన్నపేట మండల, టౌన్ పరిధి ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. తాము ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని, నిర్ణీత సమయం, ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం ఇల్లు నిర్మించుకొని లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశల్లో రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందుతుందని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల్లోపు ఇంటిని నిర్మించుకోవాలని స్పష్టం చేశారు. 4వ దశలో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ సమస్య ఉన్నా.. డయల్ యువర్ ఎమ్మెల్యే 80961 07107కి ఫోన్ చేసి మీ సమస్య తెలియజేస్తే త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

- వైభవంగా శివపార్వతుల కల్యాణం



గొర్రెకుంటలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంటలో కాకతీయుల కాలం నాటి పురాతన శ్రీ నీలకంఠేశ్వర(శివ)ఆలయం శిథిలావస్థకు చేరుకోగా.. ఇటీవల రూ.30 లక్షల విరాళాలు సేకరించి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టారు. గత మూడు రోజుల నుంచి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పార్వతీదేవి, నందీశ్వర, నవగ్రహ విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహించారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈకార్యక్రమాల్లో చివరి రోజు సోమవారం ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజారి ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విగ్రహాల ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాల్లో ఆలయ పునర్నిర్మాణ కమిటీ బాధ్యులు కొండేటి కొమురారెడ్డి, కందుల శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, కుమార్, రాము, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈనెల 4వ తేదీన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వనభోజనానికి వెళ్లడానికి నిర్ణయించారు.

యూత్ సమ్మిట్‌కు విద్యార్థిని

కేయూ క్యాంపస్ : కర్ణాటకలోని మంగళూరు యోనేసోయి డీమ్డ్ యూనివర్సిటీలో ఈనెల 5, 6వ తేదీల్లో జరగబోయే గ్లోబల్ యూత్ సమ్మిట్-2025కు కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థిని కృతిక ప్రియచందన ఎంపికయ్యారు. ఈమేరకు సోమవారం కేయూలో వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఈసం నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు ప్రియచందనను అభినందించారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

విద్యారణ్యపురి: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. హనుమకొండ జిల్లాలో 483 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా.. ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల, హనుమకొండ బస్టాండ్ రోడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కుమార్‌పల్లి పెట్రోల్‌పంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు.

ఆరుసార్లు.. అవస్థలు!

లబ్ధిదారులు వేలిముద్రలు వేస్తేనే బియ్యం

- ఈపాస్ యంత్రం అప్డేట్‌తో తిప్పలు
- మూడు నెలల కోటా ఒకేసారి..
- ఒక్కొక్కరికి 20 నుంచి 30 నిమిషాలు
- సాంకేతిక సమస్యలతో వెనుదిరుగుతున్న ప్రజలు



ఖిలావరంగల్‌లోని ఓ రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

సాక్షి, వరంగల్: జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీ పరేషాన్ చేస్తోంది. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం జూన్ నెలలోనే ఇవ్వాలని కేంద్రం ఆదేశాలిచ్చింది. ఈనేపథ్యంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్ డీలర్లతో పాటు ఆ బియ్యం తీసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులకు సాంకేతిక ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్రం, రాష్ట్ర కోటాకు వేర్వేరుగా వేలిముద్రలు వేయాల్సి ఉండగా.. మూడు నెలలకు సంబంధించి ఆరుసార్లు వేలిముద్రలు వేస్తేనే బియ్యం ఇస్తున్నారు. ఈ సమయంలో తరచూ సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలు వస్తుండడంతో ఒక్కో లబ్ధిదారుడికి 20 నుంచి 30 నిమిషాల సమయం తీసుకుంటోంది. కొన్ని సందర్భాల్లో వేలిముద్రలు సరిగ్గా తీసుకోక పోవడంతో తిరిగి మళ్లీ రేషన్ దుకాణాలకు సాయంత్రం వచ్చి తీసుకెళ్తున్నవారూ ఉన్నారు. ఇలా సాంకేతిక సమస్యలతో అటు రేషన్ డీలర్లు, లబ్ధిదారులకు తిప్పలు తప్పట్లేదు. రోజంతా కూర్చున్నా డీలర్లు పది క్వింటాళ్ల బియ్యం సైతం ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. వరంగల్ నగరంతో పాటు జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పౌరసరఫరాల అధికారులకు ఫిర్యాదులు వస్తున్నా.. అదంతా రాష్ట్రస్థాయిలోనే ఉందని, రాష్ట్రమంతటా ఒకటే సాఫ్ట్‌వేర్ ఉందనే సమాచారమిచ్చి మిన్నకుండిపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఇబ్బందులు రాకుండా చూడాలని డీలర్లు కోరుతున్నారు.

దఫాల వారీగా సరఫరా...

జిల్లా వ్యాప్తంగా 509 రేషన్ దుకాణాలుండగా, 2,66,479 మంది రేషన్ కార్డులున్నాయి. 7,94,087 మంది లబ్ధిదారులున్నారు. వీరికి నెలకు 5,01,441 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరమవుతోంది. అంటే మూడు నెలలకు కలిపి 15,04,323 మెట్రిక్ టన్నుల బియ్యం ఒకే నెలలో లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఇప్పటికే వరంగల్ ఏనుమాముల, నర్సంపేట వర్ధన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా దఫాలవారీగా రేషన్ దుకాణాలకు బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు సరఫరా చేస్తున్నారు. మూడు నెలలకు కలిపి బియ్యం నిల్వలకు ఆయా రేషన్ దుకాణాల్లో సరిపడినంత స్థలం లేకపోవడంతో రేషన్ డీలర్ల సమాచారం మేరకు ఆయా దుకాణాలకు మళ్లీ సన్నబియ్యం కోటాను అందిస్తున్నారు. అయితే ఒక్కో వ్యక్తి నుంచి ఆరుసార్లు వేలిముద్రలు స్వీకరించడం ఒక ఎత్తయితే ముఖ్యంగా వృద్ధుల వేలిముద్రలు చాలా రేషన్ దుకాణాల్లో సరిగ్గా ఆయా సాఫ్ట్‌వేర్లు తీసుకోకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓటీపీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంచాలని లబ్ధిదారులు అంటున్నారు. దీనివల్ల రేషన్ దుకాణం వద్ద తొందరగా లైన్లు క్లియర్ అవుతాయంటున్నారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..

ఒక కుటుంబంలో నలుగురు వ్యక్తులుంటే ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 24 కిలోలు వస్తాయి. గత మే నెలలో ఒకేసారి లబ్ధిదారుడు వేలిముద్ర పెడితే 24 కిలోల బియ్యం డీలర్లు ఇచ్చేవాళ్లు. అదే మూడు నెలల కోటా ఒకేసారి ఇచ్చేందుకు ఈ-పాస్ యంత్రాన్ని అప్డేట్ చేయడం వల్ల 24 కిలోలకు రావాల్సిన వాళ్లకు 20 కిలోలకు ఒకటి, నాలుగు కిలోలకు ఒకటిగా వేర్వేరుగా కేంద్రం, రాష్ట్రం కోటా కింద రెండుసార్లు వేలిముద్రలు తీసుకుంటున్నారు. అది కూడా ఒక నెలకు రెండుసార్లు, మూడు నెలలకు కలిపి ఆరుసార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి వస్తుండడంతో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. ఈపద్ధతిలో బియ్యం ఇవ్వడానికి 20 నుంచి 30 నిమిషాల సమయం తీసుకుంటోంది.

మూడు నెలల బియ్యం తీసుకున్నా..



రేషన్‌షాపులో యంత్రంపై వేలిముద్రలు పెట్టి జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్న బియ్యం తీసుకున్నా. ప్రభుత్వం ఒకేసారి బియ్యం ఇవ్వడం మాకు చాలా సంతోషాన్నిచ్చింది. నెలంతా బియ్యం ఇస్తారని తెలియక రేషన్ షాపుల వద్ద జనాలు గుమిగూడుతున్నారు.

- ఎండీ యాకూబీ, కాశిబుగ్గ, వరంగల్

నెలంతా బియ్యం పంపిణీ..



నూతన ఈపాస్ యంత్రాల అప్డేట్‌తో కొన్ని ఇబ్బందులున్నాయి. సాంకేతిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ప్రతి ఒక్క లబ్ధిదారుడికి రేషన్ బియ్యం అందిస్తాం. జూన్ నెలంతా బియ్యం పంపిణీ జరుగుతుంది. కార్డుదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి నెలకు ఒకరికి ఆరుకిలోల చొప్పున మూడు నెలలకు 18 కేజీలు తీసుకోవాలి. ఎలాంటి అనుమానాలు వద్దు. ప్రతి ఒక్కరికి బియ్యం పంపిణీ చేసే బాధ్యత మాది.

- కిష్టయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, వరంగల్

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం : ఉద్యోగ విరమణ అనంతరం పోలీసు అధికారులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పలువురు పోలీస్ అధికారులను సీపీ సోమవారం సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన అధికారుల సేవలు నేటితరం పోలీసులకు ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన డీసీపీ జనార్దన్, ఎస్సైలు అలీ మహ్మద్, అఫ్జల్ పాషా, రాజిరెడ్డి, పురుషోత్తం, మహేందర్‌రావు, క్రిష్టాచారి, యాకూబ్ అలీ, ఏఎస్సై భీంరాజు, హెడ్ కానిస్టేబుల్ రమేశ్ గుప్తా, కానిస్టేబుల్ కొండయ్య పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులతో సీపీ సన్‌ప్రీత్ సింగ్

భూపాలపల్లి కలెక్టరేట్‌లో అమరుల కుటుంబాలను సన్మానిస్తున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఖిలావరంగల్ మైదానంలో అమరుల కుటుంబాలను సన్మానిస్తూ ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి





హనుమకొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అమరుల కుటుంబాలను సన్మానిస్తున్న మంత్రి కొండా సురేఖ



అంబరాన్నంటిన ఆవిర్భావం..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఆయా చోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ అమరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కళాకారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. - సాక్షి నెట్‌వర్క్



జనగామ కలెక్టరేట్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యం చేస్తున్న చిన్నారులు





ఖిలావరంగల్ మైదానంలో నృత్యం చేస్తున్న చిన్నారులు



మహబూబాబాద్ కలెక్టరేట్‌లో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు



జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యం చేస్తున్న చిన్నారులు



హనుమకొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'ఎస్‌ఆర్' ప్రభంజనం



రవిచంద్రారెడ్డి | నాగసిద్ధార్థ | అనుశ్రీ | సాయి | భరణిశంకర్ | సాక్షి

విద్యారణ్యపురి: దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్ -2025 ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోశ్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో అన్ని కేటగిరీల్లో కలిపి ఎం. రవిచంద్రారెడ్డి 8వ ర్యాంకు, వి. నాగసిద్ధార్థ 13వ ర్యాంకు, పి. సాక్షి 40వ ర్యాంకు, ఎ. అనుశ్రీ 47వ ర్యాంకు సాధించి ఎస్‌ఆర్ కీర్తి ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో నిలబెట్టారని వారు తెలిపారు. బి. సాయి 68వ ర్యాంకు, బి. భరణి శంకర్ 90వ ర్యాంకు, జి. రాజేశ్ 106వ ర్యాంకు, బి. వినోద్ 115వ ర్యాంకు, ఎం. వెంకటకౌసిక్ 123వ ర్యాంకు, ఎస్. పవన్ 204వ ర్యాంకు, ఎ. సంతోశ్ 265వ ర్యాంకు, బి. వాగ్దేవి 269వ ర్యాంకు సాధించారని వారు పేర్కొన్నారు. ఇంకా పలువురు ఎన్నో ర్యాంకులు సాధించారని వారు వివరించారు. భవిష్యత్‌లో మరింత అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని వారు పేర్కొన్నారు. 50 సంవత్సరాలుగా పటిష్ఠ ప్రణాళికతో హైస్కూల్, జూనియర్ కాలేజీ ఎంసెట్ , ఐఐటీల్లో విద్యనందిస్తూ ప్రతీ ఏడాది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తమ తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని వారు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

- మరో 17 మంది బీఆర్‌ఎస్ నాయకులపైనా..

డోర్నకల్: అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. సోమవారం సీఐ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించి పోలీసుల విధులకు ఆటంకం కలించారని, ర్యాలీలో పాల్గొన్న రెడ్యానాయక్‌తో పాటు మరో 17 మంది బీఆర్‌ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఐదుగురు ఏఆర్‌లకు అంతర్గత బదిలీలు

- అదనపు బాధ్యతలు కూడా..
- మరో ఏఆర్‌కు సైతం అదనపు బాధ్యతలు

కేయూ క్యాంపస్: కేయూలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఐదుగురు అసిస్టెంట్ రిజిస్ట్రార్ల (ఏఆర్)ను అంతర్గంగా బదిలీలు చేశారు. అలాగే, వారికి అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. మరో ఏఆర్‌కు మరో రెండుచోట్ల అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ వి. రామచంద్రం సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

- యూనివర్సిటీ కాలేజీలో ఏఆర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పి. శ్రీధర్‌ను పరిపాలనాభవనంలోని టీచింగ్,నాన్‌టీచింగ్ విభాగాలకు బదిలీ చేశారు. అదనంగా లీగల్ సెల్ బాధ్యతలు అప్పగించారు.
- టీచింగ్, నాన్‌టీచింగ్ విభాగంలో ఏఆర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీహెచ్ ప్రణయ్‌కుమార్‌ను సీడీసీ విభాగానికి బదిలీ చేశారు. యూనివర్సిటీ ఫార్మసీకాలేజీ, కేయూ గెస్ట్‌హౌజ్ అదనపు బాధ్యత అప్పగించారు.
- కేయూ పరీక్షల విభాగంలో ఏఆర్‌గా పనిచేస్తున్న ఆర్. శ్రీలతాదేవిని పరిపాలన భవనంలోని అకౌంట్స్ విభాగానికి బదిలీచేశారు.సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ కార్యాలయం అదనపు బాధ్యతలు అప్పగించారు.
- కేయూ అకౌంట్స్ విభాగంలో ఏఆర్‌గా పనిచేస్తున్న కె.శ్రీలతను హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కాలేజీకి బదిలీ చేశారు. సుబేదారి యూనివర్సిటీ పీజీ కాలేజీ, యూనివర్సిటీ మహిళా పీజీ కాలేజీ అదనపు బాధ్యతలు అప్పగించారు.



- కేయూ ఇంజనీరింగ్‌కాలేజీ(కోఎడ్యుకేషన్) ఏఆర్‌గా పనిచేస్తున్న బి. నేతాజీని పరీక్షల విభాగానికి బదిలీ చేశారు. అలాగే, అదే ఇంజనీరింగ్‌కాలేజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ అదనపు బాధ్యతలు అప్పగించారు.
- కేయూ అకడమిక్ బ్రాంచ్‌లో ఏఆర్‌గా పనిచేస్తున్న కోలశంకర్‌ను క్యాంపస్‌లోని యూనివర్సిటీ కాలేజీ, అలాగే ఎడ్యుకేషన్ కాలేజీ అదనపు బాధ్యతలు అప్పగించారు.

పద్మశ్రీ సమ్మయ్యకు గవర్నర్ సన్మానం



రాజ్‌భవన్‌లో సమ్మయ్యకు జ్ఞాపిక అందజేస్తున్న గవర్నర్

దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన సాంస్కృతిక సమ్మేళనం కార్యక్రమంలో జనగామ జిల్లా దేవరుప్పుల మండలానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ప్రిన్సిపల్ సెక్రటరీ దానం కిశోర్ సన్మానించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ చిందు యక్షగాన కళల వైభవం కోసం పాటుపడినందుకు సన్మానం లభించిందన్నారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, గంటా చక్రపాణి, డైరెక్టర్ తరుణ్, ఐఐసీటీ డైరెక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టెంట్‌సిటీ చోరీ కేసు సీసీఎస్‌కు అప్పగింత

కాళేశ్వరం: గత నెల 15 నుంచి 26వ తేదీ వరకు కాళేశ్వరంలో ఘనంగా నిర్వహించిన సరస్వతీనది పుష్కరాల్లో ప్రభుత్వం టెంట్‌సిటీ నిర్మాణాలు చేపట్టగా..పుష్కరాలు ముగిసిన అనంతరం దొంగలు పలు విలువైన వస్తువులు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. కాగా, ఈ కేసును స్థానిక పోలీసులు సీసీఎస్‌కు అప్పగించారు. 8 ఏసీ కంప్రెషర్లు, కూలర్లు, బెడ్‌లు తదితర వస్తువులను దొంగలు అపహరించుకెళ్లారు. దీనిపై సంబంధిత నిర్వాహకులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే అనుమానితులను విచారిస్తున్నట్లు తెలిసింది.

వైద్యసేవలు సమర్థవంతంగా అందించాలి

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- వైద్యసేవలు, ఎంజీఎం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహణపై సమీక్ష



సమీక్షలో మంత్రి పొంగులేటి, కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ఖిలా వరంగల్: పేదలకు వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని రాష్ట్ర పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ప్రధానమంత్రి స్వస్థ్య యోజన సురక్ష యోజన (పీఎంఎస్‌ఎస్‌వై) సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండీషన్ (హెచ్‌వ్యాక్) సిస్టమ్‌నకు మరమ్మతులు చేసి వెంటనే రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఖిలా వరంగల్ ఖుషమహల్ ప్రాంగణంలో జరిగిన వేడుకల అనంతరం ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారదతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. ఎంజీఎం, కాకతీయ మెడికల్ కళాశాలలోని పీఎంఎస్‌ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్వహణ, వైద్య సేవలు తదితర అంశాలపై సమీక్షించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా మెరుగైన సేవలందించాలని మంత్రి ఆదేశించారు.

చెస్‌లో దేవాన్ష్‌కు అంతర్జాతీయ రేటింగ్



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన బైరి దేవాన్ష్‌రెడ్డి చదరంగంలో అంతర్జాతీయ రేటింగ్ సాధించినట్లు జిల్లా చదరంగ సమాఖ్య ప్రతినిధి పి. కన్నా తెలిపారు. హనుమకొండ రాంనగర్‌లోని చిల్డ్రన్స్ మాంటిస్సోరి స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న దేవాన్ష్‌రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో జరిగిన అంతర్జాతీయ క్లాసికల్ విభాగంలో 1508 రేటింగ్ సాధించడం హర్షణీయమన్నారు. దేవాన్ష్‌రెడ్డి ఆరుగురు అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులతో తలపడి విజయం సాధించారన్నారు. ఈ రేటింగ్ సాధించడంపై తల్లిదండ్రులు రఘువీరారెడ్డి, దివ్య సంతోషం వ్యక్తం చేశారు.

అమ్మమ్మ ఇంటికి వచ్చి అనంతలోకాలకు..

- చెరువులో ఈతకు వెళ్లి చిన్నారి మృతి
- చిన్న ముప్పారంలో ఘటన



బాహు భరత్ తేజ్ (ఫైల్)

నెల్లికుదురు: అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఓ చిన్నారి అనంతలోకాలకు చేరాడు. స్నేహితులతో కలిసి సరదాగా చెరువులో ఈతకు వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇస్సంపల్లి సాయికుమార్, సంధ్య దంపతుల మహబూబాబాద్‌లో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. మూడు రోజులు క్రితం అమ్మమ్మతో కలిసి చిన్నముప్పారం వచ్చిన సాయికుమార్, సంధ్య దంపతుల కుమారుడు బాహు భరత్‌తేజ్ (9) సోమవారం స్నేహితులతో కలిసి ఈత కోసం చెరువు వద్దకు వెళ్లాడు. అయితే బాహు భరత్‌తేజ్ ఈత రాకుండానే చెరువులో దూకాడు. దీంతో స్నేహితులు భయపడి వెళ్లిపోగా బాహు భరత్ తేజ్ నీటిలో మునిగాడు. ఈ విషయం తెలియక బాహు భరత్‌తేజ్ తాత వెంకటయ్య చేపలకోసం అదే చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో తన మనవడి దుస్తులు చూసి చట్టుపక్కల వారిని పిలిచి చూడగా బాహు భరత్ తేజ్ అప్పటికే మృతి చెందాడు. దీంతో వెంకటయ్య.. తన మనువడి మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించాడు.

గేదెను తప్పించబోయి..మృత్యుఒడికి

- బైక్ అదుపు తప్పి యువకుడి దుర్మరణం
- ఈదులపూసపల్లి శివారులో ఘటన



హరీశ్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ యువకుడు గేదెను తప్పించబోయిన మృత్యుఒడికి చేరాడు. ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై వి.దీపిక సోమవారం వివరాలు వెల్లడించారు. గూడూరు మండలం బొల్లెపల్లికి చెందిన చిల్పూరి హరీశ్ (23) మానుకోటలోని ఆరోగ్య ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీ పనిలో భాగంగా ఆదివారం తన ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి మీదుగా వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో గేదె అడ్డు రావడంతో తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలుకాగా వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. ఈఘటనపై మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇన్నోవేషన్ హబ్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్‌గా కిరణ్‌కుమార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కే హబ్‌లోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎంప్లాయిబులిటీ అండ్ ఇన్నోవేషన్ హబ్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్‌గా క్యాంపస్‌లోని వర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు.

సోమేశ్వరస్వామివారికి నాగాభరణం బహూకరణ



నాగాభరణం చూపుతున్న ఆలయ ఈఓ,అర్చకులు

పాలకుర్తి టౌన్: స్వయం భూ శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి వారికి ఓ అజ్ఞాత భక్తుడు మిశ్రమ బంగారు నాగాభరణం సమర్పించినట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు తెలిపారు. సోమవారం పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న అజ్ఞాత భక్తుడు.. రూ.24లక్షల విలువైన 449 గ్రాముల మిశ్రమ బంగారు నాగాభరణం బహూకరించారు. స్వామివారి ప్రాణ మట్టంపై నాగాభరణం అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మహా మండపంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబుకు అందజేశారు. బంగారు నాగాభరణం సమర్పించిన అజ్ఞాత భక్తుడిని ఈఓ, అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- అతివేగంతో రోడ్డు పక్కకు వెళ్లిన కారు..
- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- కాటారం మండలం గంగారం వద్ద ఘటన



ప్రమాదానికి కారణమైన కారు



బాలయ్య (ఫైల్)

కాటారం : కారు డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త ఇద్దరు వృద్ధుల నిండు ప్రాణాలు బలితీసుకుంది. కాలక్షేపం కోసం ఇంటి ఎదుట కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్న వారిపైకి కారు దూసుకెళ్లడంతో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మారుపాక మధునమ్మ (90), నీలారపు బాలయ్య (65), మల్లయ్య ఆయన మనుమడు ఆరేళ్ల బాలుడు డానియల్‌తో కలిసి రోడ్డు పక్కన తమ ఇళ్ల ఎదుట చెట్టు నీడకు కూర్చొని కాలక్షేపం చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన మొగిళి (కారు డ్రైవర్), మరో ముగ్గురు దైవదర్శనం నిమిత్తం కాళేశ్వరం వెళ్లి అన్నారం బ్యారేజ్‌ను సందర్శించి దామెరకుంట మీదుగా తిరుగు ప్రయాణమయ్యారు. డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం కారణంగా గంగారం ఎస్సీ కాలనీ వద్ద కారు అదుపుతప్పి రోడ్డుకు అవతలి వైపుగా ఉన్న చెట్టును ఢీకొట్టి పక్కనే ఉన్న వృద్ధుల పైకి దూసుకెళ్లింది. మధునమ్మ కాలు, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన బాలయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మరో వృద్ధుడు మల్లయ్య, డానియల్‌కు సైతం తీవ్ర గాయాలవగా భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం తరలించారు. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ పారిపోయాడు. కారులో నలుగురు వ్యక్తులు ఉండగా మద్యం తాగి ఉన్నట్లు తెలిసింది. మద్యం మత్తులో అతివేగంతో వెళ్లడంతో ఇద్దరి ప్రాణాలు పోయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నలుగురిలో ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకోగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలిని కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్ పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ మొగిళిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘటనాస్థలిని సందర్శించిన ఎంపీ..

గంగారంలో కారు ప్రమాదం విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ ఘటనా స్థలిని పరిశీలించారు. ఎస్పీ కిరణ్‌ఖరేతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని, ప్రమాదానికి కారమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని, అధైర్యపడొద్దని హామీ ఇచ్చారు.

4, 5 తేదీల్లో క్రికెట్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండ, వరంగల్, జనగామ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల అండర్-19 జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 4, 5వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. కరుణాపురంలోని వంగపల్లి క్రికెట్ క్రీడా మైదానంలో నిర్వహించే ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కూడిన ఆరు జట్లు, ఉమ్మడి జిల్లా వేదికగా జూన్ రెండో వారం నుంచి నిర్వహించే వన్‌డే లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొంటాయని తెలిపారు. ఇందులో రాణించిన క్రీడాకారులు ఉమ్మడి వరంగల్ అండర్-19 జిల్లా జట్టుకు ప్రాతినిధ్య వహిస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు సెప్టెంబర్ 01, 2006 నుంచి జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు మీసేవ ద్వారా జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, సొంత క్రికెట్ కిట్‌తో హాజరుకావాలని తెలిపారు.

7న జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా నిర్వహణ కార్యదర్శి పి. రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 01, 2009 నుంచి డిసెంబర్ 31, 2010 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు 7వ తేదీ ఉదయం హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌కు ఆధార్ కార్డు, స్కూల్ బోనోఫైడ్, మున్సిపల్ బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో పాటు రూ.300 ఫీజుతో హాజరుకావాలన్నారు. ఉదయం 9గంటలకు వెయింగ్ అనంతరం ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 10, 11వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రాజైనా రైతైనా.. కొడుకైనా కూతురైనా
కలెక్టరైనా బంట్రోతైనా.. ఊరైనా పట్నమైనా
మనిషికి ప్రాప్తమయ్యే మొదటి వాహనం సైకిల్.
దోగాడే వయసులో ట్రై సైకిల్ తొక్కి
బైస్కిల్‌కు ఎదగడమే చేయాల్సింది.
ఇక అక్కడి నుంచి ఎక్కడికి చేరినా
జీవితాన్ని బేలెన్స్ చేసుకుంటూ
ముందుకు సాగమని చెబుతుంది సైకిల్.
ప్రతి ఒక్కరి బాల్యంలో సైకిల్ విడదీయరానిది.
ఆ మాటకొస్తే సైకిల్‌లోని ప్రతి పార్ట్
జీవన సందేశాన్ని వినిపిస్తుంది.
అసలు సైకిల్‌ని ఇష్టపడని వారెవరు?


నేడు వరల్డ్ సైకిల్ డే



మొదటి వాహనముకు వందనం!

సైకిల్!

ట్రింగ్ ట్రింగ్‌మని బెల్లు కొడుతూ జ్ఞాపకాలు కమ్ముకుంటున్నాయా?

చిన్నప్పుడు ఎవరిదో ఇంటి ముందు సైకిల్ స్టాండ్ వేసి ఉంటే కింద కూచుని పెడల్ తిప్పుతూ వెనుక చక్రం గిర్రున తిరుగుతుంటే చూసిన జ్ఞాపకం. ముందు చక్రంలో వెనుక చక్రంలో స్పోక్స్ మధ్యన ఉండే ఇంద్రధనువు రంగుల కుచ్చు గుబ్బలను ఆసక్తిగా చూసిన జ్ఞాపకం. వెనుక సీటుకు డైనమో ఉంటుంది. అది ఆన్ చేస్తే బ్యాక్ టైర్‌కు అంటుకుంటుంది. టైరు తిరిగే కొద్దీ డైనమో నుంచి కరెంటు జనరేట్ అయ్యి ముందున్న బల్బు వెలుగుతుంది. ఆ రోజుల్లో రాత్రుళ్లలో లైటు వెలిగే సైకిల్ తొక్కేవాడు గొప్ప.



అవును. సైకిల్ తొక్కడం గొప్పే. ఎంతమంది దగ్గర ఉండేదని. ఒకవేళ ఉన్నా అందులో అంతరం. ర్యాలీ, హంబర్ సైకిళ్లు ఉన్నవారు శ్రీమంతులు, హీరో సైకిల్ ఉన్నవారు మధ్య తరగతి వారు, అట్లాస్ అంటే ఇక పేదవాళ్లు కొని తెగ తొక్కడమే. ఆ తర్వాత బి.ఎస్.ఏ సైకిళ్లు వచ్చాయి. వాళ్లు తెచ్చిన లేడీస్ సైకిళ్లు ఆడపిల్లలను వాటిపై కూచోబెట్టి నేరుగా స్కూళ్లకు కాలేజీలకు పంపాయి. చిన్న పట్టణాల్లో సాయంత్రాలు సైకిల్ తొక్కుతూ వెళ్లే ఆడపిల్లలకు ఉండే క్రేజ్ సామాన్యం కాదు.

మగాడికి 'మగాడు' అనిపించుకునే సవాళ్లు సమాజం పెడుతూ ఉంటుంది. ఆ సవాళ్లలో ఒకటి సైకిల్ తొక్కడం నేర్చుకోవడం. ఏడు, ఎనిమిది తరగతులకు రావడంతోటే ఊళ్లలో పల్లెల్లో పిల్లలు సైకిల్ నేర్చుకుని ఉండాల్సింది. 'ఏంటి.. మీవాడికి ఇంకా సైకిల్ తొక్కడం రాదా' అనంటే అవమాన పడిపోయే తండ్రులు ఉండేవారు. కొడుకు తిట్లతో రెచ్చగొట్టి 'సైకిల్ తొక్కుతావా లేదా' లేదా అని ఎక్కించి వెనుక పరిగెత్తుతూ నేర్పించేవారు. ఆ రోజుల్లో పిల్లలు తొక్కే సైకిళ్లు ఎక్కడివని? అన్నీ పెద్దలు తొక్కేవే. అందుకే పిల్లలు మొదట ఆఫ్ పెడల్ తొక్కి, ఆ తర్వాత ఫ్రంట్ బార్ మీద కూచుని తొక్కి, కాళ్లందే ఎత్తు పెరిగాక సీటు మీద కూచుని తొక్కేవారు.

సైకిల్ తొక్కడం అంత వీజీ కాదు. ఆ రోజుల్లో ప్రతి సైకిలూ తన యజమానిని సొంత ఊరి చెరువు నీళ్లు గటగటా తాగించేది. ఒక సైకిలుకు బ్రేకులు పడవు. ఒక సైకిల్‌కు పెడళ్లు ఊడిపోతాయి. ఒక సైకిల్‌కు చైను లూజు. మరో సైకిలుకు స్టాండ్ పడదు. స్టాండ్ వేసి జరగ్గానే ధబేలున పడుతుంది. ఒక సైకిలుకైతే సీటు అట్టగట్టుకుని పోయి కూచుంటే ముళ్ల మీద కూచున్నట్టు ఉంటుంది. ఒక సైకిలు సైడుకు లాగుతూ ఉంటుంది. ఒక సైకిలుకు హ్యాండిలు వంకర. ఇక పంక్చర్లు వేసి వేసి లోపల టైరు బ్యారుమన్నా ఓనరు కనికరించక దాన్ని తొక్కుతూనే ఉంటాడు. డబ్బులే లేని ఆ కాలంలో సైకిలే సిరి.

సైకిల్ వల్ల ఫ్రెండ్‌షిప్స్ ఏర్పడతాయి. ఫ్రంట్ రాడ్ మీద కూచుని సినిమాకొచ్చే వాడొకడు. బ్యాక్ క్యారేజీ మీద కూచుని సంతకు పోదాం అనేవాడొకడు. ఎదురుగాలిలో తొక్కుతుంటే వెనుక కూచున్నవాడు కూడా తోడు తొక్కుతాడు. అంటే రెండు పెడళ్ల మీద నాలుగు కాళ్లు. సైకిల్ డౌన్‌లో తొక్కేటప్పుడు గడ్డిపోచకంటే తేలిగ్గా ఉంటుంది. ఎదురుగాలిలో తొక్కుతుంటే రాకాసి దెయ్యమంత బరువు పెరుగుతుంది.

అన్నింటి కంటే హింస ఏమిటంటే చైనుకు ఉన్న మడ్‌గార్డు గనుక పెడల్‌కు రాసుకుంటూ ఉంటే మనం వీధి వెంట వెళుతున్నామని ప్రతి ఒక్కరూ గుర్తిస్తారు.. ఆ గర్‌గర్‌మనే సౌండ్‌కి.

సైకిల్‌కు సింగారాలు చేసేవారు ఉండేవారు. హ్యాండిల్‌కు చెరొక మిర్రర్‌ని బిగించే సోగ్గాళ్లు ఉండేవారు. హ్యాండిల్ మీద ఫ్రంట్ క్యారేజ్ బిగిస్తే వాటి మీద బుక్స్ పెట్టుకోవచ్చు. సీటుకు స్పాంజ్ కవర్ చాలా షోకు. స్టీలు బిందెల మీద పేర్లు రాసినట్టు సైకిల్ హ్యాండిల్ మీద ఓనర్ పేరు రాయించడం సేఫ్. సైకిల్ దొంగతనం అయితే పోలీసులు ఆ పేరును బట్టి వాపసు చేసేవారు.

ఆ రోజుల్లో అద్దె సైకిళ్ల జమానా నడిచింది. ఐదారు సైకిళ్లు అద్దెకు ఇస్తూ బతికే వారుండేవారు. సైకిళ్లన్నీ అద్దెకెళ్లిపోతే కావాల్సిన వాళ్లు వెయిట్ చేస్తూ కూచునేవారు. కొందరైతే రేపొద్దున నాకు సైకిల్ కావాలి అని ముందే అద్దెకు మాట్లాడుకునేవారు. సైకిల్ లేకుండా పని ఎవరికి జరిగేదని? సామాన్లు తెచ్చుకోవాలన్నా, పక్కూరికి పనికి వెళ్లాలన్నా, నీళ్లు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా బాగా లేకపోతే డాక్టర్‌ని పిలుచుకు రావాలన్నా, చావు కబురు చెప్పాలన్నా సైకిలే గతి.

సైకిల్ వేదాంతి. బతుకు బండిని బేలెన్స్ తప్పకుండా చూసుకోమని, అత్యాశలకూ అతి కోరికలకూ బ్రేకులు వేస్తూ నువ్వెంత తొక్కగలవో అంతలోనే బతకమని, మంచి అనుబంధాలనే ఆయిల్‌ను తరచూ రిమ్ములకు రాస్తూ ఉండమని, మంచి చెడ్డల్లో పాల్గొంటూ సైకిల్ బెల్లులా ఉనికి చూపమని, వెనుక క్యారేజీ మీద కూచోబెట్టుకునే పాటి సహాయమైనా ఇతరులకు చేస్తూ ఉండాలని, జీవితపు పరుగుకు అప్పుడప్పుడు స్టాండ్ వేసి నిలబెట్టమని లేదంటే కనీసం సైడ్ స్టాండ్ వేయమని చెబుతుంటుంది. లేదంటే హటాత్తుగా సైకిల్ మొరాయించి ఓవరాయిలింగ్‌కు వస్తుందని హెచ్చరిస్తుంది.

సైకిల్‌లా సింపుల్‌గా బతకడం ఇవాళ చాలా కష్టమైపోతుంది. కాసింత గాలి కొడితే ఇక సైకిల్ ఏమీ అడగదు. కాని నేడు మనం ఉపయోగిస్తున్న, వాడుతున్న, అందుకోవాలనుకుంటున్న ప్రతిదీ మన నుంచి చాలా అడుగుతున్నాయి.

ఇంటి వాకిటలో నిలబెట్టిన సైకిల్ ఎంత నిమ్మళంగా ఉంటుంది!

'వరల్డ్ సైకిల్ డే' రోజున జీవితపు వేగాన్ని తగ్గించుకుని ఆస్వాదనకు పెడల్ వేద్దాం.

– కె.

ఉమెన్ సేఫ్టీ

ఆపదలో అండగా...

బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని మైసూర్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ కరణ్ సరికొత్త పరికరాన్ని తయారు చేశాడు.

ఐజీడబ్ల్యూఎస్(ఇన్నోవేటివ్ ఇంటెలిజెంట్ జీయోఫెన్స్-ఎనేబుల్డ్ వేరబుల్స్ సిస్టమ్స్) అనే పరికరం మహిళలు ఆపదలో ఉంటే వారి ఎమర్జెన్సీ కాంటాక్ట్‌ను ఎలార్ట్ చేస్తుంది.

'డివైజ్‌లోని ముఖ్యమైన ఫీచర్‌లలో ఒకటి...జియోఫెన్స్-బేస్డ్ డిటెక్టర్. ఒక మహిళని ఎవరైనా మూడు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాలో అవుతున్నప్పుడు ఈ డివైజ్ సందేహాస్పద వ్యక్తి మొబైల్ ఫోన్‌ను గాని, బ్లూటూత్ డివైజ్ అడ్రస్ గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అంటున్నాడు కరణ్.

ఈ డివైజ్‌లో జియోఫెన్స్-బేస్డ్ సేఫ్టీ టైమర్ కూడా ఉంటుంది. యూజర్ ఒక డెస్టినేషన్ చేరుకోవడానికి టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఒక అమ్మాయి షాపింగ్‌కు వెళ్తూ 30 నిమిషాలలో ఇంటికి వస్తానని చెబితే సిస్టమ్ ఆమె జియోలొకేషన్‌ని మానిటర్ చేస్తుంది. సెట్ చేసిన టైమ్ లోపు ఇంటి జియోఫెన్స్‌లోకి రాకపోతే డివైజ్ ఆటోమెటిక్‌గా ఆమె లోకేషన్‌ని ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి పంపిస్తుంది. డివైజ్‌లో 'రిటర్న్ హోమ్ సేఫ్టీ రిమైండర్' కూడా ఉంటుంది. డివైజ్‌లో మరో సేఫ్టీ ఫీచర్...డేంజర్-జోన్ నోటీఫైయర్. ఇది హై-రిస్క్ జీపీఎస్ లొకేషన్స్ ప్రీలోడెడ్ జాబితాను ఉపయోగిస్తుంది. యూజర్ ఈ ప్రాంతాలలోకి వెళ్లినప్పుడు వేరబుల్ బజర్ యాక్టివేట్ అవుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి తెలియజేస్తుంది.


కరణ్



సమ్‌థింగ్ స్పెషల్

దుప్పటి లెహంగా



'ఫ్యాషన్ అనేది ఫ్యాబ్రిక్ స్టోర్ నుంచి కాదు మన ఊహాల నుంచి మొదలవుతుంది' అంటారు. సిమ్రాన్ క్రియేటివిటీని చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. ఢిల్లీకి చెందిన కంటెంట్ క్రియేటర్ సిమ్రాన్ ఆనంద్ ఇరవై కిలోల బెడ్ షీట్‌ను ఆకట్టుకునే లెహంగాగా మార్చి ఔరా అనిపిస్తోంది.

'ఔట్‌ఫిట్ ఫ్రమ్ స్క్రాచ్' కాప్షన్‌తో ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సిమ్రాన్.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు... 'బెడ్ షీట్‌లలో నాకు ఫ్యాషన్ కనిపించింది'

'లెహంగాగా మార్చడం ద్వారా దుప్పట్లకు సెకండ్ లైఫ్ కూడా ఇవ్వవచ్చు' అంటుంది సిమ్రాన్.

ఇక నెటిజనుల స్పందన విషయానికి వస్తే... 'దుప్పటితో లేహంగా ఏమిటీ!' అనే వెక్కిరింపుల కంటే...

'క్రియేటివ్ ఐడియా' అనే ప్రశంసలే ఎక్కువగా కనిపించాయి.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 2న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,110
బంగారం (22 క్యారెట్లు)	90,069
వెండి	99,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,00,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,910
బంగారం (22 క్యారెట్లు)	89,751
వెండి	1,01,090
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	92,180
వెండి	1,00,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,250
బంగారం (22 క్యారెట్లు)	88,550
వెండి	98,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,630
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి

రోహిణి కార్తె: జూన్ 8 వరకు
మృగశిర కార్తె: 8 నుంచి





'విత్తన బిళ్ల'లతో వరి నాట్లు!



వరి విత్తనాలతో నారుమడి పోసి, తర్వాత పొలంలో నాటేయటం మనకు తెలుసు. అయితే, కేరళకు చెందిన అజి థామస్ అనే రైతు వినూత్నంగా ట్రేలలో విత్తన బిళ్లల్లో నారు పెంచి, ఆ తర్వాత బిళ్లలతో కూడిన నారునే పొలంలో నాటుతున్నారు. ఎకరానికి 2.5-5 కిలోల వరి విత్తనాలు చాలు. 20 రోజులు ముందే పంట కోతకు వస్తోంది. కూలీల ఖర్చు 75% తగ్గింది. హెక్టారుకు 5.5-6 టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని ఆవిష్కర్త చెబుతున్నారు.

- ఆవు పేడ, పంచగవ్య, జీవామృతంతో కూడిన బయో స్లర్రీతో వరి విత్తన బిళ్లల తయారీ
- విత్తన బిళ్లల్లో పెరిగిన వరి నారుతో పొలంలో నాట్లు
- మొక్కకు 50–60 పిలకలు.. హెక్టారుకు 6 టన్నుల ధాన్యం దిగుబడి
- 75% తగ్గిన మానవ శ్రమ
- కేరళ రైతు శాస్త్రవేత్త అజి థామస్ అద్భుత ఆవిష్కరణ

కేరళలోని వయనాడ్ జిల్లా అంబలవాయల్‌కు చెందిన అజి థామస్ కూరగాయలు, అరటి, రబ్బరుతో పాటు వరిని పండిస్తారు. రైతులు తగిన ఆదాయం లేక వరి సాగు మానుకుంటున్నారు. ఈ పూర్వరంగంలో బయో స్లర్రీతో వరి విత్తనాల 'పెల్లెటైజేషన్' పద్ధతిని ఆయన అభివృద్ధి చేశారు. విత్తనం చుట్టూ మట్టిని లేపనం చేస్తే వాటిని విత్తన గుళికలు అనొచ్చు. ఇది అలా కాదు. నాలుగు పలకలుగా ఉండే పేడ తదితర పోషకాలతో కూడిన బిళ్లలో వరి విత్తనం పెంచి, నాట్లేస్తారు. కాబట్టి 'విత్తన బిళ్లలు' అని చెప్పుకుందాం.

కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు దీనిపై అధ్యయనం చేసి బయో స్లర్రీలోని సూక్ష్మజీవులు పొలం మట్టిలోని పోషకాలను విచ్ఛిన్నం చేసి వరి మొక్కలకు అందించటంతో రెట్టింపు దిగుబడి వస్తున్నదని వారు తెలిపారు.

ఈ పద్ధతిలో హెక్టారుకు 5.5–6 టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని, వయనాడ్ ప్రాంతంలో సాధారణ పద్ధతిలో వచ్చే ధాన్యం దిగుబడితో పోల్చితే రెట్టింపని థామస్ తెలిపారు. కూలీల ఖర్చు 25 శాతానికి తగ్గింది. ప్రతి కుదురుకు 50–60 పిలకలు వస్తున్నాయి. కంకి పొడవు పెరిగింది. ఎకరానికి వరి విత్తనాల అవసరం 30–50 కిలోల నుంచి 2.5–5 కిలోలకు తగ్గింది. పంట 15–20 రోజులు ముందే కోతకు వస్తోందని అజి థామస్ తెలిపారు.

విత్తన బిళ్లల తయారీ ఖర్చు ఎంత?

హెక్టారుకు సరిపడా వరి విత్తన బిళ్లల తయారీకి 12–14 కిలోల బయో–స్లర్రీ అవసరం. దీనికి హెక్టారుకు రూ. 20 వేల వరకు ఖర్చవుతుందని అంచనా. ఇది సాధారణ రసాయనిక సాగు పద్ధతిలో ఎరువులు, ఇతర ఉత్పాదకాల సగటు ఖర్చు కంటే రెట్టింపు. అయినప్పటికీ, కూలీల అవసరం/ఖర్చు, విత్తనాల ఖర్చు తగ్గి ధాన్యం దిగుబడి రెట్టింపు కావటంతో ఈ పద్ధతిలో వరి సాగు లాభదాయకంగా మారిందని థామస్ వివరించారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

కేరళ ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) ఈ పద్ధతిని ప్రోత్సహిస్తోంది. దీంతో, ఈ పద్ధతి కేరళలో రైతుల ఆదరణ పొందుతోంది. ఇతర రాష్ట్రాల్లో కూడా రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారని అజి థామస్ చెబుతున్నారు.

'విత్తన బిళ్ల' అంటే? తయారీ ఎలా?

వరి విత్తనాలను ట్రేలలోని చిన్న చిన్న చతురస్రాకారపు గదుల్లో బయో స్లర్రీని నింపి, అందులో వరి విత్తనం పెట్టి, మొలకెత్తిస్తారు. ఆ తర్వాత పొలంలో నాట్లు వేసే పద్ధతి ఇది. ఆవుపేడ, పులియబెట్టిన ఆకుల ద్రావణం, పంచగవ్య, ద్రవ జీవామృతంతో పాటు సూడోమోనాస్, అజోస్పిరిల్లమ్ వంటి జీవన ఎరువులు కలిపి బయో-స్లర్రీ మిశ్రమాన్ని తయారు చేస్తారు. బల్ల మీద ఉంచిన స్టెయిన్‌లెస్ స్టీల్ ట్రేలో లేదా సాధారణ బోలు రబ్బరు మ్యాట్‌లో 1–1.5 అంగుళాల లోతు/పొడవు/వెడల్పుతో నలుచదరంగా ఉండే గుంతల్లో బయో స్లర్రీని పోసి, అందులో వరి విత్తనాలను గుచ్చుతారు. ఒక రోజులో ఆ స్లర్రీ గట్టిపడి విత్తన బిళ్లలు తయారవుతాయి. ఆ తర్వాత ట్రే నుంచి విత్తనంతో కూడిన ఆ బిళ్లలను బయటకు తీసి 12 గంటలు ఎండబెడతారు. ఆ తర్వాత వాటిపై నీరు చిలకరిస్తారు. 3 రోజుల్లో వరి మొలకలు బయటకు వచ్చి, తగినంత ఎత్తు పెరిగిన తర్వాత, ఆ బిళ్లతో కూడిన వరి నారును దమ్ము చేసిన పొలాల్లో మనుషులతో వరుసలుగా నాటుతారు. వరుసల మధ్య 25 సెం.మీ. (పది అంగుళాలు) దూరం పెడుతున్నారు. ఎకరానికి ఇట్లాంటి వరి నారు బిళ్లలు 64 వేలు అవసరమవుతాయి. ఇదే ప్యాడీ సీడ్ పెల్లెటైజేషన్ పద్ధతి.

జటిలమైన చెదలుకు ప్రకృతిసిద్ధమైన పరిష్కారాన్ని కనుగొన్న రాజస్థాన్ వృద్ధ మహిళా రైతు

యూకలిప్టస్ కర్ర ముక్కలను పొలంలో ఉంచటం ద్వారా.. చెద పురుగులు పంటలను పాడు చెయ్యకుండా కాపాడుతున్నారు



చెదలుకు యూకలిప్టస్‌తో చెక్!

చెద పురుగులు.. ఇళ్లలోనే కాదు, పంట పొలాల్లో కూడా సమస్యలు సృష్టిస్తుంటాయి. పంటలను ఆశిస్తూ 10 నుంచి 50% వరకు దిగుబడి నష్టం కలిగిస్తుంటాయి. రైతులు సాధారణంగా రసాయనాలు చల్లి పంట పొలాల్లో చెదలును నియంత్రించే ప్రయత్నం చేస్తుంటారు. అయితే, రసాయనాలతో పని లేకుండా సులభంగా, స్వల్ప ఖర్చుతో చెదలు సమస్యకు పరిష్కారాన్ని వెదకటంలో ఓ వృద్ధ మహిళా రైతు అసాధారణమైన విజయం సాధించారు. యూకలిప్టస్ కొమ్మలు/కట్టె ముక్కలను పొలంలోని పంటల సాళ్ల మధ్య ఉంచితే, చెద పురుగులు పక్కనే ఉన్న పంటల జోలికి వెళ్లకుండా యూకలిప్టస్ కొమ్మలనే ఆశిస్తున్నాయని ఆమె కనుగొన్నారు.

తళుక్కుమన్న ఉపాయం

పనులు చేస్తూనే అసాధారణంగా ఉన్న విషయాలను గమనిస్తూ ఉండటం భగవతి దేవికి అలవాటు. వంట కలపను ఇంటికి తెచ్చి పొయ్యిలో పెడుతున్న ఒక సందర్భంలో ఆమె దృష్టిని యూకలిప్టస్ కర్రలు ఆకర్షించాయి. యూకలిప్టస్ కర్ర ముక్కల పైకి మిగతా కర్రల కంటే చాలా ఎక్కువ చెదపురుగులు చేరుతున్నట్లు ఆమె గుర్తించారు. ఈ గ్రహింపు కలిగిన మరుక్షణమే ఆమె మదిలో ఒక కొత్త ఉపాయం తళుక్కున మెరిసింది. ఆలోచన వచ్చిందే తడవుగా అప్పుడు సాగులో ఉన్న సజ్జ పంటలో అమలు చేసింది. 2 నుంచి 3 అడుగుల పొడవు, 2 నుంచి 3 అంగుళాల లావు ఉన్న యూకలిప్టస్ కర్ర ముక్కలను తీసుకొని, సజ్జ పొలం అంతటా సాళ్ల మధ్యలో పెట్టింది. ఆమె అనుకున్నట్లుగానే, ఆ కర్ర ముక్కల చుట్టూ వేలకొలది చెద పురుగులు చేరి, కర్రలను కొరికి తినటం ప్రారంభించాయి. ఆశ్చర్యమేమిటంటే.. చెద పురుగులు ఇక సజ్జ మొక్కల జోలికి పోలేదు. యూకలిప్టస్ కర్ర ముక్క నుంచి 4 అంగుళాల దూరంలో ఉన్న సజ్జ మొక్కలను కూడా అవి ఆశించలేదు. అంతే. భగవతి దేవి మోహం ఆనందంతో వెలిగిపోయింది.

సజ్జ నుంచి గోధుమ వరకు..

గోధుమ చేనులో 12× 12 మీటర్ల దూరంలో ఎకరానికి 32 చొప్పున స్ప్రింక్లరు ఉంటాయి. ప్రతి స్ప్రింక్లర్‌కు దగ్గర్లో ఒక యూకలిప్టస్ కట్టె ముక్క/కొమ్మను ఆమె పెట్టారు. ఒక్క గోధుమ మొక్కను కూడా చెదలు ఆశించలేదు. ఒక్కో కట్టె ముక్కను వేలకొద్దీ చెద పురుగులు చుట్టుముట్టాయి. అంటే పంట వైపు నుంచి ఈ యూకలిప్టస్ కట్టెలు చెదపురుగుల దృష్టిని వంద శాతం మళ్లించాయన్న మాట. ఎకరానికి ఖర్చు కేవలం రూ. 320లు. ఈ కట్టెలను ప్రతి పంట కాలానికీ కొత్తవి వేయాల్సిన అవసరం లేదు. మూడు పంటల వరకు అవే సరిపోతున్నాయని ఆమె తెలిపారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ గుర్తింపు

భగవతి దేవి ఈ విషయాన్ని ఫతేపూర్ షెఖావతిలోని కేవీకే శాస్త్రవేత్తల చెప్పారు. వరుసగా నాలుగేళ్ల పాటు అనేక పంటల్లో ప్రయోగం చేసి సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. బికనెర్‌లోని రాజస్థాన్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు బార్లీ పంటలోనూ అద్భుత ఫలితాలు రావటంతో, రైతులందరికీ ఇది అనుసరించమని చెబుతున్నారు.

చిరుధాన్యాలను సాళ్లుగా విత్తుకుంటేనే మేలు

ఐఐఎంఆర్‌లో 11 రకాల చిరుధాన్యాల విత్తనాలు సిద్ధం

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్)లో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తుకోవటానికి అనువైన 11 రకాల చిరుధాన్యాల విత్తనాలను విక్రయిస్తున్నారు. జొన్నలు, పచ్చజొన్నలు ఎకరానికి 3 కిలోలు విత్తుకోవాలి. ఇతర చిరుధాన్యాలన్నీ ఎకరానికి 2 కిలోలు సరిపోతాయని, ఎకరానికి సరిపోయే విత్తనంతో బ్యాగ్‌లను సిద్ధం చేశామని ఐఐఎంఆర్ విత్తన విభాగం సాంకేతిక అధికారి రఘునాథ్ కులకర్ణి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

వరుసలుగా విత్తుకుంటే మేలు: చిరుధాన్య పంటలను వెదజల్లటం కాకుండా వరుసలుగా విత్తుకోవటం మేలు. కూలీలతో కలుపు తీయిస్తే రైతుకు మిగిలేదేమీ ఉండదు. వరుసలుగా విత్తుకుంటే యంత్రాలతో అంతరసేద్యం చేస్తూ కలుపును నిర్మూలించుకోవచ్చు. సాధారణంగా వరుసల మధ్య 22.5 సెం.మీ. దూరం పెడతారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న వీడర్ యంత్రాల వెడల్పును బట్టి సాళ మధ్య దూరాన్ని నిర్ణయించుకోవచ్చు. అవసరాన్ని బట్టి 30 సెం.మీ. / 40 సెం.మీ. / 45 సెం.మీ. వరకు కూడా సాళ్ల మధ్య దూరం పెట్టుకోవచ్చని రఘునాథ్ వివరించారు.

- జొన్న (దేశీ రకం/ హైబ్రిడ్), పచ్చజొన్న, పచ్చిగడ్డి కోసం పెంచే జొన్న ఎకరానికి 3 కిలోలు విత్తుకోవాలి.
- సజ్జ, రాగు (కెఎంఆర్ 301), కొర్ర (సూర్యనంది), సామ (సిఎల్ఎంవి1), ఊద (డిహెచ్‌బిఎం93-3), వరిగ (టిఎన్ఏయు 202), అరిక (సికెఎంవి2), అందుకొర్ర (హెచ్‌బిఆర్2)లను ఎకరానికి 2 కిలోలు విత్తుకోవాలి. ఈ విత్తనాలు ఐఐఎంఆర్‌లో అందుబాటులో ఉన్నాయి. రైతులు స్వయంగా వచ్చి కొనుక్కెళ్లాలి. ఇతర వివరాలకు.. 040–24599305.



చిరుధాన్యాల విత్తనాలు దొరికే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు: నంద్యాల (99896 25208), పెరుమామళ్లపల్లి (87906 38715), పాలెం (97050 69580)లలోని కూడా కొన్ని రకాల చిరుధాన్య పంటల విత్తనాలు అందుబాటులో ఉంటాయి.